www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 25 నవంబర్ 2024

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

వాల్టా.. ఉల్టా..

- యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
- పచ్చని చెట్లుపై గొడ్డలి వేటు
- బహిరంగంగా మొక్కల వ్యాపారం
- పట్టని అటవీశాఖాధికారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పచ్చని చెట్లు జీవకోటి మనుగడకు ఆధారమని ప్రాథమిక పాఠశాల నుంచి చదువుకున్న చదువులు ఆచరణలోకి వచ్చేసరికి ఆ మాటలు భారమవుతున్నాయి. పచ్చని చెట్టు కనిపిస్తే దాని మొదలు ఎంత.?, కొమ్మలకు ఎంత ధర గిట్టుబాటు అవుతుందని లెక్కలు వేసుకుంటూ చల్లటి నీడతోపాటు ఊపిరి పీల్చుకునే ప్రాణవాయువును అందించే వృక్షాలను అడ్డంగా నరికేస్తున్నారు. అటవీ శాఖ అధికారుల కళ్లు గప్పి కొందరు, వారికి తాయిలాలు అందజేసి మరికొందరు యథేచ్ఛగా చెట్లను నరికి అక్రమ రవాణా చేస్తూ లక్షల రూపాయలు అక్రమంగా దండుకుంటున్నారు. మరీ ముఖ్యంగా రాజంపేట మండలంలో వృక్షాలకు రక్షణ కరువైందని చెప్పడంలో సందేహం లేదు. మొక్కల కోత మిషన్ల యజమానుల వ్యాపారం మూడు పూవులు, ఆరు కాయలుగా కొనసా గుతోంది. ఆ పూలు, పండ్లను ఇచ్చే వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వ్యాపారులు అటవీశాఖ అధికారులకు మామూళ్లు అందజేసి తమ వ్యాపారాన్ని దిన దినాభివృద్ధిగా కొనసాగించుకుంటున్నారు. నందలూరు మండలానికి చెందిన ఓ వ్యాపారి రాజంపేటలో కడప-తిరుపతి ప్రధాన రహదారిలో ఒక కోత మిషన్, గాలివారిపల్లె రోడ్డులో మరో కోత మిషన్ నడుపుతూ అటవీ నిబంధనలను తుంగలోకి తొక్కు

తూ వేప, బట్ట కడప, తుమ్మ, టేకు, దిరసనం, రావి వంటి వివిధ జాతుల అరుదైన వృక్షాలను నరికేస్తున్నారు. జీవ మనుగడకు ఆధారమైన మొక్కలను నిర్దాక్షిణ్యంగా నరికి సొమ్ము చేసుకుంటుంటే, ఇదే మండలంలోని ఓ యువకుడు అరుదైన వృక్ష సంపదను కొల్లగొట్టి జాతీయ రహదారిలో టింబర్ డిపో నడుపుతూ కోట్లాది రూపాయలు వెనకే సుకుంటూ అటవీ అధికారులు తన తొత్తులు అని బహిరంగంగానే చెప్పుకుంటున్నాడు. వృక్ష సంప దను పరిరక్షించాల్సిన బాధ్యతలో ఉన్న అటవీశాఖ అధికారులు ఇవేమీ పట్టనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం శోచనీయం. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాజంపేట టింబర్ డిపో, కోత మిషన్ల యజమానులకు వాల్టా చట్టం ఉల్టాగా పరిణమించిందని ప్రజలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పట్టపగలే పచ్చని చెట్లను నరికి తరలిస్తున్నా రాజంపేట అటవీ శాఖలో పట్టించుకునే నాథుడే లేడని ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు కనీసం నెలలో ఒకటి, రెండు సార్లు టింబర్ డిపోల తోపాటు, కొయ్య కోత మిషన్లలో నిఘా పెట్టి అదుపు చేయక పోతే మండల పరిధిలో నీడనిచ్చే చెట్టుకు మనుగడ లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా రాజంపేట అటవీ శాఖ అధికారులు మొక్కల అక్ర మార్కులపై చర్యలు తీసుకుని అటవీ సంపదను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం

మండలంలో జరుగుతున్న వాల్టా చట్టం వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్‌ను వివరణ కోరగా తాను నూతనంగా బాధ్యతలు చేపట్టినందున రాజంపేటలో జరుగుతున్న వాల్టా అక్రమాలపై ప్రత్యేక డ్రైవ్ పెట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

నాణ్యమైన రోడ్లు వేయడమే లక్ష్యం

ఆర్‌అండ్‌బి ఎస్ఇ వై.సహదేవరెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ముఖా ముఖి..

జిల్లాలో అందరికి అందుబాటులో ఉండి నాణ్యమైన రోడ్లు వేయడమే తమ లక్ష్మమని ఆర్‌అండ్‌బి ఎస్ఇ వై. సహదేవరెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఆరు నియోజకవర్గాలు, 30 మండలాల రహదారులలో గుంతలను గుర్తించి రోడ్లకు పనులు ఎలా వేయాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బి కార్యాలయాల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బి కార్యాలయం రాజంపేట, మదనపల్లిలో రెండు ఇఇ కార్యాలయాలు, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లి, పీలేరులో 5 డిఇఇ కార్యాలయాలు, రాజంపేట, నందలూరు, టి. సుండుపల్లి, కోడూరు, చిట్వేల్, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, మదనపల్లి (తూర్పు), మదనపల్లి (పడమర), తంబళ్లపల్లి, బి. కొత్తకోట, పీలేరు, కలికిరి , వాయల్పాడు నందు 14 ఎఇఇ కార్యాలయాలున్నాయి.

జిల్లా వ్యాప్తంగా రోడ్లు విస్తీర్ణం ఎంత?

అన్నమయ్య జిల్లాలో రాష్ట్ర రహదారులు 595.00 కి.మీ, జిల్లా ప్రధాన రహదారులు 2,127.00 కి.మీ. మొత్తం 2,721.00 కి.మీ రహదారులు జిల్లాలో ఉన్నాయి.

గుంతలు లేని రహదారుల పనులు వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా మొత్తము పనులు 187, వాటి అంచనా మొత్తం రూ .1591.00 లక్షలు. 90 పనులు పురోగతిలో ఉన్నాయి. 97 పనులు టెండర్ దశలో ఉన్నాయి.

మున్సిపల్ రహదారుల పనుల పురోగతి తెలపండి?

జిల్లా కేంద్రం రాయచోటిలో రింగ్ రోడ్డు మరమ్మతులకు రూ. 450.00 లక్షలు మంజూరయ్యాయి. భూ సేకరణ పనులు పురోగతిలో ఉన్నాయి. భూసేకరణ అయిన వెంటనే మరమ్మతుల పనులు ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లా కేంద్రంలో రింగ్ రోడ్డు పెండింగ్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు?

జిల్లా కేంద్రంలోని రాయచోటి రింగ్ రోడ్ మంజూరైంది. నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తి చేశాం. మదనపల్లి రింగ్‌రోడ్ సర్కిల్ చనముక్కపల్లె వద్ద కొంత నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిర్వాసిత బాధితులు కోర్టులో కేసు వేశారు. సమస్యలు పరిష్కారం అవగానే త్వరలో పనులు పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

రాజంపేట, నందలూరు, కోడూరు, చిట్వేల్, రాయచోటి, మదనపల్లి (పడమర), తంబళ్లపల్లి, బి. కొత్తకోట, పీలేరు, కలికిలలో ఎఇ, ఇఇల కొరత ఉంది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది తోనే విధులు నిర్వహించుకుంటున్నాం.

పరిశుభ్రతతోనే దేశాభివృద్ధి సాధ్యం

- సామాజిక సేవలో యువత పాల్గొనాలి
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పరిశుభ్రత తోనే దేశ అభివృద్ధి సాధ్యమని, చదువుతోపాటు సామాజిక సేవలో యువత పాల్గొనాలని, 18 సంవత్సరాల వయసు నిండిన యువత ప్రజాస్వామ్యంలో కీలకపాత్ర పోషించాలని, విద్యార్థులకు కావాల్సిన ముఖ్యమైన లక్షణం అకుంఠిత దీక్ష అని, ఈ ఒక్క లక్షణం ఉంటే ఏదైనా సాధించవచ్చునని విద్యార్థులకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి దిశా నిర్దేశం చేశారు. ఆదివారం ఉదయం రాజంపేట నలంద నగర్‌లోని రీజెన్సీ నలంద విద్యాసంస్థల అధినేత జి.ఎన్ నాయుడు ఆధ్వర్యంలో రాజంపేట పరిశుభ్రత కోసం ఏర్పాటు చేసిన సేవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీజెన్సీ నలంద విద్యాసంస్థల అధినేత జి ఎన్ నాయుడు ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మన దైనందిన జీవితంలో పరిశుభ్రత, పచ్చదనం ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని అవి దేశ అభివృద్ధికి మూల స్తంభాలని పేర్కొన్నారు. పరిశుభ్రత ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజాన్ని, దేశాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని సూచించారు. విద్యార్థులు పాల్గొనడం వల్ల విద్యార్థులకే కాకుండా మొత్తం సమాజంలో పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. జీవితంలో విజయాలు సాధించిన వారు పుట్టుకతోనే గొప్ప సామర్థ్యాలతో పుట్టిన వారు కాదని, కేవలం అకుంఠిత దీక్ష వలన విజయాలు సాధించారని విద్యార్థులకు సూచించారు. అకుంఠిత దీక్ష అనేది చాలా ముఖ్యమైన లక్షణమని, విద్యార్థులు ఈ లక్షణాన్ని

జిఎన్ నాయుడుతో కలిసి రోడ్లు శుభ్రం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

అలవర్చుకోవాలని సూచించారు. నలంద విద్యాసంస్థలలో జనవరి 01, 2025 నాటికి 18 సంవత్సరాలు వయస్సు నిండబోయే విద్యార్థులు అందరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో యువత కీలక పాత్ర పోషించాలని, ప్రజలందరికీ ప్రజాస్వామ్య ఫలాలు అందాలంటే యువత పెద్ద సంఖ్యలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓటు వేసే హక్కు ఉపయోగించుకోనప్పుడు ప్రశ్నించే హక్కు కోల్పోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జి.ఎన్ నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో మన అన్నమయ్య జిల్లాలో జరగాలని విద్యాసంస్థలు, ఎన్‌జిఒలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఎఒ విజయ్ చందు, తహశీల్దార్ పీర్ మున్ని, మునిసిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులు ఫీజు చెల్లించలేదనే కారణంతో తరగతుల నుండి పంపడం, హాల్ టికెట్లు ఇవ్వకపోవడం, పరీక్షలు లేదా ప్రాక్టికల్ ఎగ్జామ్స్ రాయనీయకుండా చేయడం లాంటి చర్యలు చేపడితే సంబంధిత కళాశాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు అన్నమయ్య జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపళ్లకు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ తరగతులకు చెందిన ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఫీజుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టొదని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రయివేట్ కళాశాలల యాజమాన్యం వారు ప్రభుత్వం నుండి ఉపకార వేతనాలు అర్హత గల విద్యార్థులకు ఫీజు చెల్లించలేదనే కారణంతో తరగతుల నుండి పంపడం, హాల్ టికెట్స్ ఇవ్వకపోవడం వంటి చర్యలకు పాల్పడొద్దని పేర్కొన్నారు.

ముఖ్య అతిథిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మానవత్వానికి పట్టం కట్టిన 'మధురాంతకం రాజారాం'

ప్రజాశక్తి - కడప అర్బన్

మనిషిని కేంద్రబిందువుగా చేసుకుని మానవత్వానికి పట్టం కట్టిన రచయిత మధురాంతకం రాజారాం అని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ కె.ఎన్.సుందరేశ్వర రావు పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 138వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 'మధు రాంతకం రాజారాం జీవితం - సాహిత్యం' అనే అంశంపై డాక్టర్ కె.ఎన్.సుందరేశ్వరరావు ప్రసంగించారు. మధురాంతకం రాజారాం చిత్తూరు జిల్లా మొగరాల గ్రామంలో 1930, అక్టోబర్ 5న ఆదిలక్ష్మమ్మ, విజయరంగం పిళ్లై దంపతులకు జన్మించారని పేర్కొన్నారు. ఉద్యోగరీత్యా ఆ జిల్లాలోని పల్లెప్రాంతాల్లో పనిచేశా న్నారు. పాతతరం తెలుగు కథారచయితల్లో పేరెన్నికగన్న వారిలో మధురాంతకం రాజారాం ఒకరన్నారు. రాజారాం కథలు 1960-80 మధ్యకాలంలో ఊపిరి పోసుకున్నాయని, సమాజంలోని చెడును తాను గమనిస్తున్నా, ఆ చెడును విమర్శించే కంటే, మంచిని మాత్రమే చెప్పడం ఈయన ప్రత్యేకతని వివరించారు. ఆయన సుమారు 300కు పైగా కథలు, రెండు నవలలు, నవలికలు, నాటకాలు, గేయాలు, సాహితీవ్యాసాలు రచించారని పేర్కొన్నారు. 2023లో రాజారాం కథలన్నింటినీ 5 సంపుటాలుగా ఎమెస్కో వారు ప్రచురిం చారన్నారు. ఆయన కుమారులు మధురాంతకం నరేంద్ర, మహేం ద్ర కూడా సాహిత్యంతో పెనవేసుకున్నవారే అన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ కె.ఎన్.సుందరేశ్వర రావును సి.పి .బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది కలసి సత్కరించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ మౌనిక, కె.వి.రమణారెడ్డి, శ్యామసుందర్ రెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు, పుత్తా పుల్లారెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, డాక్టర్ రాజగోపాల రెడ్డి, రాజారెడ్డి, పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జగన్‌మోహన్‌రాజు

పేదలందరికీ ఉచిత కార్పొరేట్ వైద్యం

ప్రజాశక్తి - రాయచోటి

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా ఉచిత కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సోదరుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో అమరావతి ఆసుపత్రిలో నూతనంగా యాజమాన్య బాధ్యతలను డాక్టర్ వాసుదేవ రెడ్డి, డాక్టర్ మౌనికలు చేపట్టిన సందర్భంగా ఆదివారం ఆసుపత్రిలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పటిష్టంగా అమలు చేస్తూ పేదవారికి అధునాతన కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. వైద్య ఆరోగ్య రంగాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వైద్యసేవ పథకం ద్వారా అమరావతి ఆసుపత్రిలో ఉచితంగా పలురకాల వైద్యసేవలు అందిస్తారన్నారు. ఆసుపత్రి నూతన యాజమాన్యానికి వారు శుభాకాంక్షలు తెలిపారు. **ఉచిత వైద్యసేవలు అందిస్తాం..** నాణ్యమైన వైద్యసేవలు అందించి ప్రజల మన్ననలను పొందుతామని రాయచోటిలోని అమరావతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ వాసుదేవ రెడ్డి, డాక్టర్ మౌనిక, గౌరవ సలహాదారుడు కొండూరు శ్రీనివాసరాజులు తెలిపారు. అమరావతి ఆసుపత్రిలో డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకం ద్వారా ప్రసూతి వైద్యసేవలు, చిన్నపిల్లల విభాగం, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల విభాగాలలో ఉచితంగా చికిత్సలు, శస్త్ర చికిత్సలు అందిస్తామన్నారు. దీంతో పాటు ప్రయివేట్‌గా కూడా వైద్యసేవలును అందిస్తామన్నారు. ఆస్పత్రిలో అధునాతన వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయని, రాయచోటి, పరిసర ప్రాంతాల ప్రజలు అవకాశాలను వినియోగించు కోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టట్ బయారెడ్డి, డాక్టర్ నారాయణరెడ్డితో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

4న పాటల పోటీలు

ప్రజాశక్తి - రాయచోటి

స్థానిక ఎస్ఎన్ కాలనీలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో డిసెంబర్ 4 న గానగంధర్వ ఘంటసాల జయంతి సందర్భంగా పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర నాట్యకళామండలి అధ్యక్షులు ఎస్.వి. భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనే అభ్యర్థులు సభ్యత్వ రుసుం రూ .100 చెల్లించాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయతోపాటు కన్సలేషన్ బహుమతిని అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ. 3000, ద్వితీయ బహుమతి రూ. 2000 తృతీయబహుమతి రూ .1116 తోబాటు కన్సలేషన్ బహుమతి రూ .516 అందజేస్తామని తెలిపారు. విజేతలకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజే స్తారన్నారు. కార్యక్రమానికి సంగీత విద్వాంసులు పి.ప్రార్థసారధి రామచంద్ర, ఆదినారాయణ వైస్ ప్రిన్సిపల్ జీవానందం అడ్వకేట్ ధనుంజయతోబాటు సాఫ్ట్ వేర్ ఉద్యోగి ప్రేమ్ సాగర్ రెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు డిఎలు చెల్లించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్ ఉన్న డిఎలను ప్రభుత్వం చెల్లించే విధంగా ఒత్తిడి తీసుకొద్దామని విశ్రాంత ఉద్యోగుల సంఘం వాయల్పాడు తాలూకా అధ్యక్షుడు శంకర అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాబోవు రోజుల్లో విశ్రాంత ఉద్యోగుల సంఘానికి సొంత సమావేశ భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందు కోసం స్థల సేకరణ విషయాన్ని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మస్తాన్ వలి, రమణ, రెడ్డెప్ప, సారధి, నారాయణ, సూర్యనారాయణశాస్త్రీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తాలూకా అధ్యక్షులు శంకర

హెల్మెట్ల పంపిణీలో పాల్గొన్న సిఐ, బిఎరాజు

విలువైన ప్రాణాలను కాపాడడంలోనే సంతృప్తి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విలువైన ప్రాణాలను కాపాడినప్పుడే నిజమైన ఆత్మసంతృప్తి కలుగుతుందని శ్రీ పావని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బి.ఎ.రాజు పేర్కొన్నారు. ఆదివారం రాజు కుమార్తె పావని 11వ వర్ధంతి సందర్భంగా స్థానిక అమ్మచెరువు మిట్టలోని శ్రీ పావని చారిటబుల్ ట్రస్ట్‌లో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ, వెలుగు ప్రత్యేక పాఠశాల సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ పదిమందికి సేవ చేయాలన్న గుణాన్ని కలిగి ఉన్న వారిలో రాజు ఒకరన్నారు. తాను ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్నప్పటికీ ఉన్నంతలో పదిమందికి సాయపడాలన్న ఆలోచన చాలా ఉత్తమమైందన్నారు. తన బిడ్డ అనారోగ్యంతో చనిపోయిందని, ఇలాంటి పరిస్థితి మరెవరికీ రాకూడదన్న సదుద్దేశంతో గత పదకొండేళ్లుగా పావని వర్ధంతి రోజున రోడ్డుపై ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేస్తూ, ప్రాణం విలువను తెలియజేస్తున్న రాజు పలువురికి స్ఫూర్తి అని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ సమాజసేవలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం చారిటబుల్ ట్రస్ట్‌లో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం : సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ శ్రీ సత్యసాయి సేవా మందిరంలో మానవతా సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో పాటు యువతలో సేవాభావం పెంపొందే విధంగా మానవతా సంస్థ అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. మానవతా సంస్థలో విశ్రాంత ఉద్యోగులు, యువత సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కేశవ రెడ్డి, ఆనంద శెట్టి, నీళ్లభాస్కర్, రామక్రిష్ణరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం

ప్రజాశక్తి-వాల్మీకిపురం : స్థానిక బజారువీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణం జరిగి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం చండి హోమాన్ని నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చన, పంచామృతాభిషేకం, తోమాలసేవ, తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శివస్వామి, సుధీర్‌స్వామి, శీనాస్వామి, పూర్ణాస్వామి, శరత్‌స్వామి, ఆలయ ధర్మకర్త సతీష్, భక్తులు పాల్గొన్నారు.

అండర్-23 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- ఆరు వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడపలో ఎసిఎ అండర్ -23 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 38.5 ఓవర్లలో 264 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి పూర్ణ తేజ 62, హర్షవర్ధన్ 47 పరుగులు చేశారు. ఈస్ట్ గోదావరి జట్టులోని వంశీ నారాయణ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. సందేశ్ రెండు, శివ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 165 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఈస్ట్ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని సూర్య చైతన్య 43, విజయ్ 41 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని గణేష్, రవి కిరణ్, హేమంత్, సిద్ధార్థ లు ఒక్కో వికెట్ తీసుకున్నారు.

వైఎస్ఆర్ ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లోఅనంతపురం జట్టుపై మూడు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌దిగిన అనంతపురం జట్టు 49.2 ఓవర్లలో 216 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ప్రాజెక్టులోని మహేంద్ర రెడ్డి 95 (నాట్ అవుట్), దత్త రెడ్డి 37 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ జూన్ గట్టులోని సాకేత్రామ్ మూడు, పూజిస్ సాత్విక్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 217 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ తో దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 46.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి



తలపడుతున్న అనంతపురం, రెస్టాఫ్ సౌత్ జోన్ జటు

217 పరుగులు చేసి మూడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని సుబ్రహ్మణ్యం 73, శశాంక్ శ్రీ వాస్తవ 52 పరుగులు చేశారు. అనంతపురం దొడ్డిలోని దత్తారెడ్డి 3, ప్రదీప్ రెడ్డి 2, దీపక్ 2 వికెట్లు తీసుకున్నారు.

కెఎస్ఆర్ క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో ప్రకాశం జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు 46.5 ఓవర్లలో 224 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని అభినవ్ 83, లేఖజ్ రెడ్డి 33 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని సుశాంత్ నాయుడు 3 సమన్విత్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 225 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 42.2 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ చెట్టులోని ఖాజా మొహిద్దిన్ 72, సమన్విత్ 57 (నాట్ అవుట్) పరుగులు చేశారు. ప్రకాశం జట్టులోని పవన్ కుమార్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి

సిసిరోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని దేవగుడిపల్లె పంచాయతీలోని రాజీవ్ కాలనీలో ఆదివారం రూ.20 లక్షల వ్యయంతో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నియోజక వర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు సిసి రోడ్డు నిర్మాణపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. రూ.20 లక్షల నిధులను ఈ దేవగుడిపల్లి పంచాయతీకి మంజూరు చేశారని తెలిపారు. ఈ పనులన్నీ నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచిం చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ గెలుపు హర్షణీయం

ప్రజాశక్తి-కలికిరి

నూతనంగా పార్లమెంటులో అడుగుపెడుతున్న కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీకి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అభినందనలు తెలి పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జార్ఖండ్‌లో ఇండియా కూటమి గెలుపు చారిత్రాత్మకమన్నారు. వయనాడ్‌లో రాహుల్‌గాంధీ సోదరి ప్రియాంకగాంధీ అఖండ విజయం చారిత్రాత్మకమన్నారు. ప్రజల గొంతుకగా పార్లమెంటు ప్రజా సమస్యలపై ప్రియాంక గాంధీ పోరాటం చేస్తుందని అన్నారు. భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదేనని రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు.

హుస్సేన్‌కు దేవనగరి హిందీ సేవ సమ్మాన్ అవార్డు

ప్రజాశక్తి-పుల్లంపేట

హుస్సేన్

మండల పరిధిలోని ఈ కమ్మపల్లి జడ్‌పి హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సయ్యద్ సర్తాజ్ హుస్సేన్‌కు దేవనాగరి హిందీ సేవా సమాన్ 2024 పురస్కారానికి ఎంపిక అవడం జరిగిందన్నారు. రాష్ట్ర భాష సేవ సంగ్ ఫౌండేషన్ వారు ప్రత్యేక దేశంలోని అన్ని రాష్ట్రాలలో జాతీయ భాష హిందీ ప్రచారం అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి పురస్కారాలు అందించారు. 2024 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ నుంచి తనను ఎంపిక చేసినట్లు సయ్యద్ హుస్సేన్ పేర్కొన్నారు. డిసెంబర్ 1న హైదరాబాదులో ప్రముఖులతో ఈ అవార్డు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

భోజనాన్ని అందిస్తున్న రూపేష్ రెడ్డి

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రాణ మిత్రుడు జాబు సుధీర్‌కుమార్‌రెడ్డి వర్ధంతి పురస్కరించుకొని కొర్లకుంట గ్రామానికి చెందిన ముక్కా రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 500 మంది వృద్ధులకు, అనాధ ఆశ్రమంలో, మాత శిశు సంక్షేమ ఆస్పత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపేష్ రెడ్డి మాట్లాడుతూ తన ప్రాణ మిత్రుడు అయిన సుధీర్ కుమార్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని అభాగ్యులకు అన్నదానం, దుప్పట్లు, పండ్లు మొదలగు వాటిని పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో వారి జ్ఞాపకార్థంగా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె రామమోహన్, అనిల్, రెడ్డి, బాషా పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : స్థానిక అహోబిలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం కడప బాలోత్సవం వారు పులివెందుల నియోజకవర్గం పరిధిలోని అన్ని యాజమాన్య పాఠ శాలల హైస్కూల్స్ విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వాహించారు. సీనియర్స్ విభాగానికి 'పర్యావరణ పరిరక్షణ', జూనియర్స్ విభాగానికి 'మా కుటుంబం' అనే అంశాల మీద పోటీలను నిర్వహించారు. దాదాపు 1000 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి ధన్యశ్రీ, రెండవ బహుమతి జస్వంత్, మూడో బహుమతి ఎస్ హిమశ్రీ.. సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి బి మిధున, బి గంగా, బి పవన్ రెండు, మూడు బహుమతులు గెలుచుకున్నారు. 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కడప బాలోత్సవం అధ్యక్షులు జి గోపాల్, కార్మిక నాయకుడు గఫూర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మద్దతు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొత్త లక్ష్మీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వైవీయు ఫైన్ ఆర్ట్స్ విభాగ అధ్యాపకులు చిన్న రాయుడు, ఈరప్ప, డ్రాయింగ్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మధు, జన విజ్ఞాన వేదిక నాయకులు శివరాం, జయ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విఆర్‌ఎ మృతి

వీరపునాయునిపల్లె : మండలంలోని తగేండుపల్లె విఆర్‌ఎ దరియ చంద్ర (47) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా చంద్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. చంద్ర నేత్రాలను బంధువులు ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేశారు. ఆయనకు తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలున్నారు. చంద్ర గ్రామానికి మంచి సేవలు అందించారని విఆర్‌ఎ, విఆర్‌ఒలు కొనియాడారు.

ఓటర్ల ప్రత్యేక శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో శని, ఆదివారాలలో ఓటర్ల ప్రత్యేక శిబిరం ముగిసిందని తహశీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. ఆదివారం 182, 287, 191, 190, 195,198 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఫారం-6, ఫారం-8కు 28 దరఖాస్తులు అందినట్టు ఆమె పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. తప్పులు సరిచేసు కోవడానికి చనిపోయినవారు, పేర్లు తొలగించడానికి బిఎ ల్‌ఒలు యాప్‌లో సవరణ మేరకు చేయబడింది ఆమె అన్నారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు, విఆర్‌ఒలు ఓటర్ల డేటా ఎంట్రీ ఆపరేటర్ నరేంద్ర పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహశీల్దార్

మామిడిలో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

మండల ఉద్యానశాఖ అధికారి వనిత

ప్రజాశక్తి-వీరబల్లి

పండ్లలో ఫలరాజు మామిడి. వేసవిలో వచ్చే ఈ పండ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. నాణ్యమైన అధిక దిగుబడులు రైతులకు లాభాలు తెచ్చిపెడతాయి. అందుకు పూత, పిందె, దశలు కీలకం ఈ దశల్లో రైతులు సరియైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాల పంటను పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి వనిత పేర్కొన్నారు. మండలంలో మామిడిలో అంతర్జాతీయంగా పేరు పొందిన వీరబల్లి మామిడికి అంత గిరాకింది. వీరబల్లి మండలంలో 5వేల ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారు. ప్రధానంగా బేనీషా, బంగినపల్లి, మల్లెగొబ్బ, పనాస, ఖాదర్, నీలం, తదితర రకాల పండ్లు పండిస్తున్నారు. సాధారణంగా మామిడి తోటలు డిసెంబర్‌లో పూతకు వస్తాయి. జనవరిలో పిందెలు పుడుతాయి. ఈ కాలం మామిడి దిగుబడులకు కీలకం. ఈ దశల్లో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. గత కొంతకాలంగా మామిడి పై ప్రకృతి పగ పట్టింది. ఈ నెలలో కురిసిన వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్త తీసుకోవాలని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. లేక పోతే డిసెంబరులో వచ్చే పూత జనవరికి వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. మామిడి తోటలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి, ప్రధానంగా చెట్ల మొదుల్లోనూ వర్షపు నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదు. డిసెంబర్‌లో మొదలయ్యే చలి, సంక్రాంతికి చుట్టు ముట్టే పోగా మంచు, మామిడి తోటల పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వాతావరణంలోని మార్పుల వల్ల పలు రకాల తెగుళ్ల సోకే అవకాశం ఉంటుందన్నారు. పూత పిందె దశల్లో మామిడి రైతుల సరైన జాగ్రత్తలు తీసుకుంటే నే అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది. మామిడి పూత బాగా రావడానికి బాగా నిలబడడానికి కాయ నాణ్యత మెరుగు పడటానికి జింక్, బోరాన్ మాంగనీస్ ఐరన్ వంటి సూక్ష్మ పోషకాల అవసరం ఎంతో ఉంటుంది. అవసరాన్ని బట్టి ఆయా సూక్ష్మ పోషకాల మిశ్రమాలను పిచికారి చేయాలన్నారు. జింక్ లోపించిన మొక్కల్లో ఆకులు చిన్నగా మారి రెమ్మల ఎదుగుదల మందగిస్తుందని, ఫలితంగా మొక్కలు బలహీన పడతాయి. దీంతో పూత బాగా రాదు. ఇక బోరాన్ మామిడి పూత, పిందె రావడానికి సహాయపడుతుంది. పూత గుత్తుల్లో పిందే, కట్టే విధంగా పుష్పాలు అధికంగా రావడానికి పూర్తిస్థాయిలో ఫలదీకరణ జరిగి పిందెలు అధికంగా ఏర్పడడానికి ఉపయోగపడుతుంది. బోరాన్ లోపించిన చెట్ల ల్లో పిందె రాలడం ఎక్కువగా కనిపిస్తుంది. కాయల పై బుడపలు రావడం, బంక కారణం, ఏర్పడడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఫలితంగా కాయల నాణ్యత దెబ్బతింటుందని అన్నారు.మామిడి పూత పిందె దశలో పలు రకాల చీడలు, తెగుళ్ల ఆశించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేయకపోతే తీవ్ర నష్టం కలగజేస్తాయి. మామిడిలో పువ్వు ముగ్గులు తొందరగా ఒకేసారి రావడానికి నవంబర్ చివరి వారంలో

మామిడితోట

లేదా డిసెంబర్ మొదటి వారంలో మల్టీకే 10 గ్రాములు లీటరు నీటికి లేదా ఆర్క మాంగో స్పెషల్ మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మామిడిలో పువ్వు మొగ్గ దశ నుంచి గోలికాయ దశ వరకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు, పూ మొగ్గ దశ లో ఆశించే తేనెమంచు పురుగు, బంక తెగుళ్లు, మసి తెగుళ్లు, బూడిద తెగుళ్లు, ఈ తెగుళ్లను కంట్రోల్ చేయడానికి మోనోక్రోటోఫాస్ లేదా ఆసిఫేట్ లేదా ఒడిస్ రెండు గ్రాములు ఒక లీటర్ నీళ్లకి కలిపి పిచికారి చేయాలి దీనితోపాటు సల్ఫర్ మూడు గ్రాములు అలాగే ఆర్క మాంగో స్పెషల్ మూడు గ్రాములు ఒక లీటర్ నీళ్లకు కలిపి పిచికారి చేయాలన్నారు. నల్లపూస దశ ఈ దశలో ఆశించే తేనమంచు పురుగులు తామర పురుగులు, బూడిద తెగులు పక్షికన్న తెగులును అదుపు చేయడానికి తయోమితాబ్జామ్ 0.3 గ్రాములు, థయోపినైట్ మిథైల్ ఒక గ్రాము, కార్బెండిసం, ఒక గ్రాము, మ్యాంగోజబ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. గోలికాయ దశలో ఆశించే తొడిమకుళ్ళు తెగుళ్లు, పిండి నల్లిని అదుపు చేయడానికి నేటిఒ ఒక గ్రాము లీటర్ నీళ్లకు కలిపి పిచికారి చేయాలని చెప్పారు. తెల్ల పూత దశలో అనగా పూలు విచ్చుకున్నప్పుడు రసాయన మందులను

పిచికారి చేయకూడదని ఎందుకంటే పరాగ సంపర్కానికి దోహదపడే ఈగలు, తేనెటీగలు చనిపోవడం జరుగుతుందన్నారు. మందులను పిచికారి చేసేటప్పుడు ముందుగా మొదల్లకు తర్వాత లావు కొమ్ములకు ఆఖరుగా ఆకుల పైన మందులు పిచికారి చేయాలని, ఈ క్రమంలో చెట్ల భాగాలకు మందులను పిచికారి చేస్తే మొదలు ,లావు కొమ్మల రెండు చీలికల్లో దాక్కునే పురుగులు కూడా చనిపోతాయని సూచించారు.

ఆ మలుపులు ప్రమాదానికి పిలుపులు

వాడవాండ్లపల్లి వద్ద ఉన్న ప్రమాదకరంగా ఉన్న మలుపు

ప్రజాశక్తి-కలికిరి

ఆర్‌అండ్‌బి, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని కొన్ని రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మండలంలో సోమల కలకడ రహదారిలోని గుట్టపాలెం పంచాయతీ వాడవాండ్లపల్లి దగ్గర ఉన్న మలుపులు వద్ద చెట్లు పొదలు రోడ్డుపైకి వచ్చేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. గుట్టపాళ్యం పంచాయతీలోని కెబర్నేపల్లి-గుట్టపాలెం, వాడవలపల్లి-గుట్టపాలెం, జిబర్నేపల్లి కలికిరి, గుట్టపాలెం -డికెపల్లి మీదుగా కలికిరికి పోయే లింకు రోడ్లు సైతం పూర్తిగా కంప చెట్లు, గుబురుగా రోడ్డుపైకి రావడంతో వాహనదారులు తరచుగా ప్రమా దాలు బారిన పడుతున్నారు. ఇప్పటికే వాడవాండ్లపల్లి నుంచి జంగంపల్లి మీదుగా గుట్టపాలెంకు వెళ్లే రోడ్డులో రెండు మూడు ప్రమాదాలు చోటు చేసు కుని మృతి చెందిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. గుట్టపాలెం పంచాయతీలోని 24 గ్రామాల నుండి నిత్యం ఏదో పనిమీద కస్బాలో ఉన్న సచివా లయం పనుల పై ప్రజలు వెళ్ళవలసి వస్తుంది. రోడ్లు సక్రమంగా లేకపో వడం, మలుపులు ఎక్కువగా ఉండటం, రోడ్లకు ఇరువైపులా ముళ్ళపొదలు రోడ్డుపైకి రావడం వంటి కారణాలతో ప్రమాదాల బారిన పడి, ఆస్పత్రులు పాలై ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడి రోడ్లకు మరమ్మతులు చేసి, రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌సిసితో క్రమశిక్షణ, దేశభక్తి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లె జడ్‌పిహైస్కూల్(తెలుగు)లో ఎన్‌సిసి దినోత్సవ వేడుకలను ప్రధానోపా ధ్యాయులు అంజాద్ అలీ ఖాన్, ఎన్‌సిసి సిటిఒ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ కృష్ణప్ప, స్థానిక సర్పంచ్ పాపులమ్మ, మల్లప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్‌పి హైస్కూల్‌కు ఎన్‌సిసి శిక్షణ యూనిట్ సంవత్సర క్రితం మంజూరు అయిందన్నారు. పాఠశాలలోని ఎక్కువ మంది విద్యార్థులు ఎన్‌సిసిలో చేరారని అన్నారు. ఎన్‌సిసి శిక్షణ ద్వారా విద్యార్థులలో దేశభక్తితో పాటు క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇతర ప్రాంతా లలో జరుగుతున్న ప్రత్యేక ఎన్‌సిసి శిక్షణ క్యాంపులలో పాల్గొని ఉత్తమ ప్రతిభను ప్రదర్శి స్తున్నారని అన్నారు. ఇటీవల మహారాష్ట్ర రాష్ట్రంలో జరిగిన ఎన్‌సిసి ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు మణికంఠ, బాలులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి సిటిఒ వెంకట గోపాల్, పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ కృష్ణప్ప, స్థానిక సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, కానిస్టేబుల్ హరి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి కి మారుపేరు ఎన్‌సిసి అని మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ వ్యవస్థాపకులు కరాటే సురేష్ పేర్కొన్నారు. స్థానిక హోప్ మున్సిపల్ పాఠశాల(కోటబడి)లో ఎఎన్‌ఒ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 76వ ఎన్‌సిసి

నిమ్మనపల్లి: ఎన్‌సిసి విద్యార్థులతో హెచ్‌ఎం అంజాద్ అలీఖాన్

దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కరాటే సురేష్ మాట్లాడుతూ ప్రతి యేటా నవంబర్ 24న ఆదివారం ఎన్‌సిసి దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా, నాయకులుగా తీర్చిదిద్దడంలోనూ, క్రమశిక్షణ కలిగిన, బాధ్యతాయుతమైన, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సిసి) స్థాపించబడిందన్నారు. యువతీ, యువకులకు ఎన్‌సిసి చక్కని వేదిక అని, ఎన్‌సిసిలో పని చేసే వారికి సైన్యంలో చేరి సేవ చేయడానికి, ఉద్యోగాలలో రిజర్వేషన్‌కు ఉప యోగ పడుతుందన్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్యే

మదనపల్లి: చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో వివిధ కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులతో ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ పెట్టుకున్న బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు విడుదలఅయ్యాయి. ఆదివారం ఎమ్మెల్యే నేరుగా బాధితుల ఇంటికెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికిత్సలు పొందుతూ ఆర్థిక ఇబ్బందులకు లోనైనా వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు మంజూరు అయ్యాయయన్నారు. వాటిని బాధితుల ఇంటికి వెళ్లి పంచి పెట్టడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పేదలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. మదనపల్లిలో 11 మంది బాధితులు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం అర్జీ పెట్టుకుంటే, రూ. 11లక్షల నిధులు విడుదల అయ్యాయని, బాధితులకు బాధ్యతగా అందించామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగార్జున బాబు, కోటూరుపల్లి వేణు, కత్తి లక్ష్మన్న, మున్నా నాయక్, మంజునాథ్, షంషీర్, బద్రి, జెసిబి వేణుపాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రెడ్డిపల్లి అరుంధతివాడకు చెందిన చిట్వేలి సుబ్బ నరసయ్యకు రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.42,773లు చెక్కును అందించారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకుడు పసుపులేటి వెంకటరమణ, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా 'ఉయ్యాలవాడ' జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 218వ జయంతి వేడుకలను మండల కేంద్రం కలికిరిలో ఆదివారం రెడ్డి జెఎసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులను ఎదిరించిన ధైర్యశాలి, తెలుగు వారి పౌరషాన్ని రుచి చూపించిన రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యుడు పులి సత్యనారాయణరెడ్డి కొనియాడారు. స్థానిక ధరణి హోటల్ ఆవరణలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు లాయర్ రాంప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, తాతిరెడ్డి, సహదేవరెడ్డి, రాజారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, భాస్కర్రెడ్డి, సుధాకర్రెడ్డి,

ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రెడ్డి జెఎసి నాయకులు

వెంకటేశ్వరరెడ్డి, కవి వేంపల్లి అబ్దుల్బాదర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈశ్వరయ్య

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-గుర్రంకొండ

విద్యార్థులలో వ్యాసరచన పోటీలు సృజనాత్మకతను పెంపొందిస్తాయని రిడో సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐలా ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గురుకుల బాలిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ నీతి కథలు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 58 విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. నీతి కథలు చాలా బాగున్నాయని, విద్యార్థులు చాలా బాగా రాశారని అభినందించారు. విద్యార్థుల్లో సృజనా త్మకతను పెంపొందించేందుకు ఇలాంటి కార్య క్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలి పారు. తరగతుల వారీగా విజేతలైన విద్యార్థులకు మెమోంటోలు, మిగిలిన విద్యార్థులకు కూడా కన్సోలేషన్ బహుతులు, సర్టిఫికేట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయి శిరీష, షిర్డీ సాయి ఆలయ ట్రస్ట మెం బెర్ మడికిరి ప్రభాకర్ మూర్తి, ఉప్పు శ్రీనివాసులు, కన్యకా ఆలయ కమిటీ అధ్యక్షులు మాకం వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది, రిడో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుగవాసి ప్రసాద్‌బాబును గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

బలిజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి :'సుగవాసి'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

బలిజలు ఐక్యమత్యంతోనే అని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, రాజంపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె మర్రిచెట్టు వద్ద దాసిరెడ్డి మిట్టన ఆదివారం నవ్యాంధ్ర బలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తీకమాస వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుగవాసి సోదరులు హాజరయ్యారు. బలిజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, బలిజల అభివృద్ధి ఐకమత్యం తోనే సాధ్యపడుతుందని అన్నారు.

నాగేశ్వరనాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాసన వెంకటరమణ, ప్రముఖులు

నాయుడు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-రామాపురం

బడుగు బలహీన వర్గాలకు జన చైతన్య ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.నాగేశ్వర నాయుడు చేసిన సేవలు మరో లేనివని జడ్‌పిటిసి మాసన వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోన శివానందపురం నాగేశ్వరరావు నాయుడు వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఆయనవిగ్రహాన్ని జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, ఆర్‌హెచ్‌జిబి ఎంఎస్‌ఎస్ ప్రజా చైతన్య సంఘం ఎన్‌జిఒ అధినేతలు బివి.రత్నం, చెన్నారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 90వ దశాబ్దంలో రామపురం కేంద్రంగా జన చైతన్య సమగ్ర అభివృద్ధి సంఘం బ్రాంచ్ కార్యాలయంలో ఏర్పాటుచేసి ఎస్‌సి, ఎస్‌టి బడుగు బలహీన వర్గాలలో చైతన్యం తీసుకురావడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మహిళల్లో ఆర్థిక స్వావలం కోసం పొదుపు సంఘాలు మహిళాభివృద్ధికి ఎస్‌సి, ఎస్‌టి గ్రామాలలో అక్షరాస్యత పెంచడం ఎంతో కృషి చేశారని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రైతు సంఘ నాయకుడు వి.రంగారెడ్డి, నాగేశ్వర్ నాయుడు భార్య మనోరమ, కుటుంబ సభ్యులు సురేంద్ర నాయుడు, బ్రహ్మపుత్ర నాయుడు, జన చైతన్య సమగ్ర సంఘం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎన్ను ఒబ్బిడి కోసం రోడ్డుపై వేసిన రాగులు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా ?

-గోళీల వలే జారుతున్న రాగులు

-పట్టని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి-రామసముద్రం

ప్రస్తుత సీజన్‌లో రాగుల ఎన్ను ఒబ్బిడి కోసం రోడ్లపై వేయడం వలన ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ద్విచక్ర వాహనదారుల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురౌతున్న సందర్భాలు చూస్తూనే ఉన్నాం. తుఫాను నుంచి తేరుకున్న అనంతరం మండలంలోని మినికి , మూడు రోడ్ల సమీపంలోని నయారా పెట్రోల్ బంక్, జంగాలపల్లి సమీపంలో అత్యంత ప్రమాదకరమైన మలుపులో రాగులు పోసి వాహనాలు రాకపోకలకు అంత రాయం కల్గిస్తున్నారు. రాగులు ఒబ్బిడి చేసే రైతులు. ఈ విషయంపై సంబం ధించిన అధికారులు ప్రతిరోజు కార్యాలయాలకు వస్తున్న సమయంలో వారి కంటపడ్డా కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రాగులు వేసిన ప్రాంతాల్లో కాస్త ఏమరుపాటుగా బ్రేకులు వేసినా వాహనాలు నిలువరించలేక ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. రోడ్లపై రాగి ఎన్ను, రాగి తాలు, ఉలవచెట్లు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు. కొన్ని చోట్ల కనీసం ఒక్క అడుగు వెడల్పు రోడ్డు వదలకుండా వాహన దారులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఇప్పఇటికైనా సంబంధిత అధి కారులు రోడ్లపై రాగిఎన్ను, ఉలవ చెట్లు వేయ కుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

13 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-పుల్లంపేట : ఓబులవారి మండల పరిధిలోని బిపి రాచపల్లి పంచాయతీ, చిన్నరాజుపల్లి గ్రామ సరిహద్దుల్లో రైల్వే కోడూరు సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్‌ఐ మహేష్‌నాయుడు అతని సిబ్బందితో గ్రామ సరిహద్దుల్లో గల కంపచెట్లలో పేకాట ఆడుతున్నటువంటి 13 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.22,600లు నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.